చినుకు పడితే చిత్తడే

- చేపూర్‌లో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ హ మ్లెట్ విలేజ్ హరిపూర్(కాలనీ)లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్న వర్షానికే కాలనీలో రోడ్లు చిత్తడిగా మారుతుండటంతో స్థానికులు ఇంటి నుంచి కాలు బయటపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. పాలకులు మారుతున్నా సమస్య మాత్రం అలాగే ఉంటుందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన చిన్న వర్షాలకు కాలనీ నుంచి బాల్కొండ మండలం చిట్టాపూర్ బైపాస్, స్మశాన వాటికకు వెళ్లే దారి సుమారు అర కిలోమీటర్ మేరా చిత్తడిగా మారింది. అర కిలోమీటర్ మేరా రోడ్డు పూర్తిగా బురదమయంగా మారడంతో కాలనీ వాసులు కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో వర్షాకాలంలో ఇంటి నుంచి బయటకు రావడానికి కాలనీవాసులు జంకుతున్నారు. వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు.


చేపూర్‌లో చిత్తడిగా మారిన రోడ్డు


బురద రోడ్డుపై నడవడానికి ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు

అపరిశుభ్రంగా పరిసరాలు..

కాలనీలో మినీ వాటర్ ట్యాంకుల వద్ద నల్లాలు విరిగిపోయాయి. దీంతో ట్యాంకులోని నీరు ఏకధాటిగా వస్తుండడంతో నీటి వృథాతోపాటు ట్యాంకుల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతోపాటు మురికి కాలువలు సైతం లేక పోవడంతో మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. గత ప్రభుత్వం కాలనీని గ్రామ పంచాయతీగా ప్రకటించిన విషయం విదితమే. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మొరం వేసి వదిలేస్తున్నారు..

కాలనీవాసులు రోడ్డు దుస్థితిపై ప్రజా ప్రతినిధులు దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన ఫలితం లేక పోయింది. కంటితుడుపు చర్యగా మొరం వేసి వదిలేస్తుండడంతో సమస్య ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కాలనీ వాసులతో పాటు వ్య వసాయ క్షేత్రాలకు వెళ్లే వారితో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. తాత్కాలిక ఉపశమనంగా మొరం వేసి వదిలేస్తుండడంతో కేజ్ వీల్ ట్రాక్టర్లు వెళ్తుండడంతో సమస్య మొదటికి వస్తోంది. శాశ్వతంగా పరిష్కరించడానికి సీసీ రోడ్డు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధులు ఆ దిశలో ప్రయత్నాలు చేయలేదు.

సీసీ రోడ్డు నిర్మించాలి..



గ్రామంలోని రోడ్డు పరిస్థితి గురించి ఇప్పటివరకు పట్టించుకున్న ప్రజా ప్రతినిధులు ఎవరూ లేరు. తాత్కాలికంగా మొరం వేసి వదిలేస్తుండడంతో సమస్య అలాగే ఉంటుంది. సీసీ రోడ్డు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– గంగాధర్, స్థానికుడు

నడవడం కష్టంగా ఉంది..



వర్షం పడితే రోడ్డుపై నడవడం కష్టంగా మారింది. వర్షకాలం ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. పాలకులు, అధికారులు దృష్టి సారించి కాలనీలో రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. – వర్ణిత, స్థానికురాలు

సమస్యను పరిష్కరిస్తాం..

కాలనీలో రోడ్డు దుస్థితిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తాను. అప్పటి వరకు మొరంతో రోడ్డును చదును చేయించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాను. –లక్కం ప్రభాకర్, గ్రామ ప్రత్యేక అధికారి, చేపూర్

మిషన్ భగీరథ నీళ్లు వచ్చేదెన్నడు?

- ఎనిమిదేళ్లుగా సుభాష్‌నగర్ కాలనీవాసుల ఎదురుచూపులు
- కనెక్షన్లు ఇచ్చి.. నీటిని సరఫరా చేయని అధికారులు

ఆర్మూర్‌టౌన్: గత ప్రభుత్వం ప్రతి ఇంటికి నల్లా నీరు ఉండాలన్న లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించి, అమలు చేసింది. కానీ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీవాసులకు ఇప్పటికీ మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం బోరుబావి నీళ్లే తాగుతున్నామంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతిచోట మిషన్ భగీరథ నీరు వస్తుంటే తమ కాలనీకి రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మిషన్ భగీరథ పథకంలో కాంట్రాక్టర్లు ప్రతి ఇంటికి కనెక్షన్ ఇచ్చి వదిలేశారు. కానీ నీటి సరఫరా చేయడం లేదు. కనెక్షన్ ఉన్నప్పటికి నీరు రాకపోవడంతో ఇంకా ఎన్నాళ్లు ఎదురు చూడాలని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు వంద కుటుంబాలు వరకు నివసిస్తున్నారు. కానీ ఆ కాలనీలో ఇప్పటివరకు మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో కాలనీవాసులు సురక్షిత జలాలకు దూరమవుతున్నారు. గతంలో స్థానిక కౌన్సిలర్, కాలనీ వాసులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన స్పందన లేకుండా పోయింది. కాలనీవాసులు ఇప్పటికి ప్రభుత్వ బోరు, కాలనీవాసులు వేసుకున్న బోరు ద్వారా వచ్చే నీటితో అవసరాలను తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి, మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


వృథాగా ఉన్న మిషన్ భగీరథ పైపులు


సుభాష్‌నగర్ కాలనీ

సురక్షిత నీటిని అందించాలి..

ఆర్మూర్ పట్టణంతోపాటు అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు వస్తోంది. తమ కాలనీలో ఇంకా ఇప్పటికి భగీరథ నీరు రావడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మిషన్ భగీరథ నీరు వచ్చే విధంగా చూడాలి. – పోశన్న, సుభాష్‌నగర్ కాలనీ

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలి..

సుభాష్ నగర్ కాలనీకి అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి కాలనీవాసులకు భగీరథ నీరు అందించాలి. బోరు నీరు తాగలేక ప్యూరిఫైడ్ వాటర్ కొనుగోలు చేసి తాగాల్సి వస్తోంది.

– లావణ్య, సుభాష్ నగర్ కాలనీ

క్లుప్తంగా

మంజూరైన నిధులను విడుదల చేయాలి



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలో పలు అభివృద్ధి పనులకు గతంలో నిధులు మంజూరు కాగా, విడుదల కాలేదని, వెంటనే నిధులను విడుదల చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కలిసి, సమస్యను విన్నవించారు. వెంటనే మంత్రి మండలానికి రూ. 1.25 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. మండలంలోని కౌల్‌పూర్ గ్రామంలో ఫంక్షన్ హాల్ కోసం రూ. 50 లక్షలు, నందిపేటలోని గౌడ ఫంక్షన్ హాల్‌కు రూ. 25 లక్షలు, పద్మశాలి ఫంక్షన్ హాల్‌కు రూ. 25లక్షలు, మైనార్టీ షాదీఖానాకు రూ. 25లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన మంత్రికి వినయ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాక్లూర్: మాణిక్‌భండార్ శివారు ఆర్టీసీ కాలనీలోని శక్తి హనుమాన్ ఆలయ నూతన కమిటీని ఆదివారం కాలనీ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, కోశాధికారిగా రాములను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు రాజేందర్ వారికి నియామక పత్రాలను అందించి, అభినందించారు. గౌరవ అధ్యక్షుడు సత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి రోహిత్, కోశాధికారి సుమన్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, లక్ష్మి, సంయుక్త కార్యదర్శి వేణు, సభ్యులు పుష్పలత, రంగాచారి, నాగభూషణంలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన నేతలు



బోధన్: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆదివారం కరీంనగర్ క్యాంప్ ఆఫీసులో బోధన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, జిల్లా ప్రతినిధి అశోక్ గౌడ్ ఉన్నారు. బోధన్ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని వారు మంత్రిని కోరారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఆదివారం కాలనీ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీలో పిచ్చిమొక్కలు తొలగించారు. సమితి అధ్యక్షుడు సుంకేశ్రీనివాస్, పుప్పాల శివరాజ్, కమలాకర్, సతీష్, ఎర్రభూమన్న, గడ్డం శంకర్, రాజు, సాయన్న, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ సేవలు చిరస్మరణీయం

నిజామాబాద్‌నాగారం: రాజకీయ దురంధరుడు డీ శ్రీనివాస్ స్ఫూర్తి మార్గ నిర్దేశకుడు అని, ఆయన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ మున్నూరుకాపు ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట రాజశేఖర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు కళ్యాణ మండపంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో డీఎస్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ కాపులను ఐక్యతతో ముందుకు నడిపారని పేర్కొన్నారు. ఆయన దిగ్గజ నేతగా ఎదిగిన వైనం అందరికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. డీఎస్ లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిది వివరించారు. గౌరవ అధ్యక్షుడు బుస్స ఆంజనేయులు, ముఖ్య సలహాదారులు ఆకుల ప్రసాద్, అబ్బపుర్ రవి, నారాయణరెడ్డి , పెద్దోళ్ల నాగరాజు, సత్యనారాయణ, జనార్దన్ సాయికుమార్, అజ్జన్ శేఖర్ పాల్గొన్నారు.

స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలి

బాల్కొండ: వాతావరణ మార్పుల వలన రైతులు వరిలో స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి రైతులకు ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు సరిగా పడకపోవడంతో రైతులు జాగ్రత్త పడి వరి పంటలో స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలి. సన్న రకాల్లో బీపీటీకి బదులుగా 135 రోజుల్లో చేతికందే తెలంగాణ సోనా లేదా 118 రోజుల్లో వచ్చే అంజన, 95–100 రోజుల్లో వచ్చే ప్రత్యుమ్నా ఎన్నుకోవడం మంచిది. ఆగష్టు మొదటి వారంలో నారు పోసుకుని చివరిలో నాట్లు వేసుకోవచ్చు. ప్రస్తుత వాతావరణ పరిస్థితిల్లో వరి పంటలో దొడ్డు రకం ఎంపిక కూడ చాల కీలకమే. 1010 రకం కంటే బతుకమ్మ రకం ఎంపిక చేసుకోవాలి. బతుకమ్మ రకం 130–135 రోజుల్లో చేతికి వస్తుంది. పురుగులను తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడిని స్తుంది. కూనారం సన్నాలు అనే పేరుతో సన్నరకం అంటు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అవి 1010 కంటే దొడ్డుగానే ఉంటాయి. ఈ రకాలను గిత్యాల్ పరిశోధన కేంద్రం నుంచి పొందవచ్చు. ప్రస్తుత సంవత్సరం అన్ని పంటల్లో పురుగుల బెడద ఎక్కువ ఉండే సూచనలున్నాయి. కావున విత్తనాల ఎంపిక కీలకమవుతుంది.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆర్మూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు.. సాలూరలో..

ఆర్మూర్‌టౌన్/వేల్పూర్/బోధన్/రెంజల్/బోధన్ టౌన్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాను సమితి నాయకులు ఆవిష్కరించారు. ఆర్మూర్‌లో జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారాం బాలు జెండాను ఆవిష్కరించారు. అలాగే మందకృష్ణ మాదిగ 59వ జన్మదిన సందర్భంగా రక్తదానం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య, జిల్లా కో– ఆర్డినేటర్ డల్లా సరేష్, నరేష్, బాలాజీ, సాయిలు, కళ్యాణ్, పోశెట్టి, అశోక్, పోచయ్య, వికేష్, మహేందర్, వినోద్, నాగం శ్రీనివాస్, మంద ప్రభాకర్, చంటి, అబ్బయ్య, భూమయ్య, చంద్రయ్య, కంగేకర్ గంగాధర్, బైరం పల్లి శంకర్, నర్సింలు, లాలయ్య, లక్ష్మయ్య, నాగరావు, లింబయ్య, గ్రామ పెద్దలు వెంకట్ పటేల్, స్వామి గౌడ్, రాజాగౌడ్, కెజీ గంగారాం, సంజీవ్, సుబాష్, నజీర్ పాల్గొన్నారు.

రజతోత్సవాలకు తరలిన నాయకులు

బోధన్‌టౌన్: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో మేడి పాపన్న ఆధ్వర్యంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకలకు బోధన్ నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. నాయకులు విద్యాసాగర్, నింబూరి లక్ష్మణ్, సాయిలు, నాగరావ్, గొప్ప సాయిలు, నగేష్, కన్నం సాయిలు తదితరులు ఉన్నారు.


రెంజల్‌లో..


బోధన్ పట్టణంలో..


పడగల్‌లో..

ఆధ్యాత్మికం..

■ గ్రామ దేవతలకు జలాభిషేకం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో, బాల్కొండ మండల కేంద్రంలో, మెంగోరా మండలం దూదిగాంలో ఆదివారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రా మస్తులు పవిత్ర గోదావరి వరకు కాలి నడకన వెళ్లి గంగాజలాన్ని తీసుకు వచ్చారు. అనంతరం గ్రామంలో డప్పువాయిద్యాలతో, వల గొడుగుతో ఊరేగించారు. గ్రామంలో పోశవ్వ, తాతాయి, హనుమాన్, మారేవ్వలకు జలాభిషేకాలు నిర్వహించారు.

■ స్వర్ణామృత ప్రాశన మందు పంపిణీ

నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని కేదారీశ్వర ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు స్వర్ణామృత ప్రాశన మందు వేశారు. పదిహేను ఏళ్ల లోపు పిల్లలకు ఈ మందును ఉచితంగా అందజేశారు. ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



■ వైభవంగా బోనాల పండుగ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని బీటీనగర్ కాలనీలో ఆదివారం పూసల సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా మహాలక్ష్మి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంఘ ప్రతినిధులు, మహిళలు ఉన్నారు.



మాజీ ఎంపీటీసీలకు సన్మానం


అంకాపూర్‌లో సన్మానం పొందిన మాజీ ఎంపీటీసీలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ ఎంపీటీసీలు ఎంసీ గంగా రెడ్డి, మంగ్లారం మహేందర్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ముక్తార్‌ల పదవీకాలం ముగియడంతో ఆదివారం వారిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. తమ పదవీ కాలంలో గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రజలకు మాజీ ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ మొండి మహేశ్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యంను ముదిరాజ్ సంఘం, వీర సావర్కర్ యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గౌరాయి రవి, సంటి శ్రీనివాస్, సుంకరి కృష్ణ, గంగన్న, ప్రసాద్, సంతోష్, దత్తు, రవి, దీపక్, సాగర్,గణేష్, శేఖర్ పాల్గొన్నారు.


వేల్పూర్‌లో..

ఎడపల్లి(బోధన్): మండలంలోని పోచారం ఎంపీటీసీ పద్మ ముత్తన్నను ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. వీడీసీ అధ్యక్షుడు అశోక్, ఇస్తారీ, కోలా సాయిలు, కమ్మరి రవి, కట్ట సుధాకర్, సంతోష్, సాయిలు, రాంచందర్, శివ, తదితరులు వున్నారు.


పోచారం గ్రామంలో..

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

ఖలీల్‌వాడి: యువత మత్తు పదార్థాలకు గురికావద్దని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ అన్నారు. నగరంలోని కోటగల్లీలోని ఎన్ఆర్ భవన్‌లో ఆదివారం పీవైఎల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో యువత పెడదారిన పడకుండా ప్రగతిశీల ఆలోచనల వైపు రావాల్సిందిగా కోరారు. నాయకులు ఆల్గోట్ రవీందర్, చెలిమెల రాజేశ్వర్, అనిశ్, నవీన్ కుమార్, సాయగౌడ్, సాయిబాబా, గంగాధర్, కిరణ్, సాయిచందు, ప్రసాద్, డప్పు గంగన్న, మహిపాల్, నసీర్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమర వీరులకు నివాళులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం మాదిగ సంఘాల ఐక్య వేదిక ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో మాదిగ దండోరా ఆవిర్భావ దినోత్సవ వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అలాగే మాదిగ అమరవీరుల స్థూపం ఏర్పాటు చేసి మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించారు. మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, పస్కనర్సయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ, డప్పులు కొట్టే మాదిగలకు రూ. 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. నాయకులు మైలారం బాలు, గంగని స్వామి, రింగుల భూషణ్, బాజన్న, దేవయ్య, సాయన్న పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న మాదిగ సంఘాల ఐక్యవేదిక నాయకులు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామీణ గ్రంథాలయానికి ఆదివారం డిచ్‌పల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు నర్సయ్య పుస్తకాలను వితరణ చేశారు. నరేష్, యాటకర్ల గణేష్,పురుషోత్తం, గంట సుధాకర్, రవి, బాలాగౌడ్, గంగారెడ్డి,పోశెట్టి, వినీత్, రాజు, దేవిసింగ్, తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ కార్డుల పంపిణీ



బోధన్‌టౌన్(బోధన్): ప్రార్థన మందిరాల్లోని ఇమామ్, మౌజామ్‌లకు ఆదివారం పట్టణంలోని అమృత ట్రూలైఫ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎండీ ఇఫ్తెకార్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. వైద్యులు రహిమాన్, ఉపేంద్ర, విఘ్నేశ్వర్, ఆస్పత్రి మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



ఎడపల్లి/నిజామాబాద్ రూరల్: నిత్య జీవితంలో యోగా భాగం కావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో ఆదివారం మహర్షి పతాంజలి యోగా కేంద్రం 17వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. ఆరోగ్యానికి యోగా, వ్యాయమం ఎంతో మేలుచేస్తుందన్నారు. మహర్షి పతాంజలి యోగా కేంద్ర వ్యవస్థాపకుడు ప్రభాకర్ నగరంలో ఎన్నో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలతో యోగాసనాలు చేయించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్, దాదాన్నగారి విఠల్‌రావు, మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్‌లను నిర్వాహకులు సన్మానించారు. మాడవిడి వినోత్ కుమార్, కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	డెస్పి కెబుల్ మీ4 (తెలుగు) – 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 –	కల్కి ఏడి-2898 (3డీ తెలుగు) – 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 –	కల్కి ఏడి-2898 (తెలుగు) – 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 –	కల్కి-2898 (తెలుగు) – 11.30, 3.15, 7.00, 10.45